వార్త

శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు శనివారం 26 ఏప్రిల్ 2025





శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

# అధికారులతో రూరల్ ఎమ్మెల్యే సమీక్ష



**నెల్లూరు కార్పొరేషన్,ఏప్రిల్ 25 ,ప్రభాతవార్త:** నేడు నగర కార్పొరేషన్ కార్యాలయంలో కొండాయపాలెంగేట్, బి.వి. నగర్ రైల్వే బ్రిడ్జిలపై నగర కమిషనర్ నందన్, ఆరిఓ,విద్యుత్‌శాఖ, పబ్లిక్ హెల్త్ శాఖ, కార్పొరేషన్,రైల్వే శాఖ అధికారులతో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండాయపాలెం గేట్, బి.వి.నగర్ రైల్వే గేట్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిలు లేనందున ప్రజలు అనేక సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎట్టకేలకు కొండాయపాలెం గేట్, బి.వి.నగర్ రైల్వే గేట్ ల వద్ద కేంద్ర రైల్వే శాఖ రైల్వే అండర్ బ్రిడ్జిలను మంజూరు చేసింది స్పష్టం చేశారు. అధికారులందరినీ సమన్వయం చేసుకునే బాధ్యత నేనే తీసుకుంటా. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వెల్లడించారు. అలాగే మే 10వ తేదీ లోపల వివిధ శాఖ అధికారుల సహకారాన్ని రైల్వే శాఖ అధికారులకు అందిస్తామని పేర్కొన్నారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో ,ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రోత్సాహంతో జూన్ నెలాఖరు లోపు టెండర్లు పిలువనునట్లు వివరించారు.

## పరిశ్రమలకు శుద్ధి కేంద్రాల నీటి వినియోగానికి ప్రణాళికలు

**కమిషనర్ వై.ఓ నందన్**



**నెల్లూరు కార్పొరేషన్,ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని మురుగునీటి శుద్ధి కేంద్రాల ద్వారా శుద్ధి చేయబడిన నీటిని స్థానిక పరిశ్రమలకు సరఫరా చేసి పారిశ్రామిక అవసరాలకు వినియోగించేలా ప్రణాళికలు యోచిస్తున్నామని కమిషనర్ వై ఓ నందన్ ప్రకటించారు. కృష్ణపట్నం పోర్టు పరిసర పరిశ్రమల ప్రతినిధులు, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశాన్ని కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని మూడు ప్రధాన మురుగునీటి శుద్ధి కేంద్రాల ద్వారా శుద్ధి చేయబడిన నీటిని వ్యవసాయ అవసరాలతో పాటు పారిశ్రామిక అవసరాలకు కూడా వినియోగించవచ్చని తెలిపారు. పెద్ద సంఖ్యలో పరిశ్రమలు ఉన్న కృష్ణపట్నం పోర్టు ప్రాంతానికి శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించమని అధికారులను కమిషనర్ ఆదేశించారు. మురుగునీటి శుద్ధి కేంద్రాల నీటి పునర్వినియోగానికి సంబంధించిన ప్రతిపాదనలను పూర్తిగా సిద్ధం చేసి రాష్ట్రపట్టణ పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ లకు నివేదించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్ మోహన్ రావు, డి.ఈ.ఈ. లు సుధేష్ణ, రఘురాం, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుని కలిసిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ. నందన్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకొని మా జీ డి.ఆర్. డి.ఓ ఛైర్మెన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు డాక్టర్ జి. సతీష్ రెడ్డిని స్థానిక టెక్కేమిట్టలోని వారి నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

## ఆర్ఐఓ గా టి.వరప్రసాద్ బాధ్యతల స్వీకరణ



**నెల్లూరు,ఏఫ్రిల్25 ప్రభాతవార్త-విద్య** ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారిగా టి.వరప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆర్ఐఓగా ఉన్న ఆదూరు శ్రీనివాసులు పదోన్నతిపై చిత్తూరు జిల్లా డిఐఈఓ గా వెళ్లారు. దీంతో వెంకటాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా విధులు నిర్వహిస్తున్న వరప్రసాద్‌ను జిల్లా ఆర్ఐఓగా నియమిస్తూ ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఉత్_ర్వులు అందుకున్న వరప్రసాద్ శుక్రవారం నగరంలోని స్దానిక స్టౌన్‌హౌస్‌పేటలోని ఆర్ఐఓ కార్యాలయానికి వచ్చేసి బాధ్యతలు స్వీకరించారు. కాగా గతంలో కూడా వరప్రసాద్ జిల్లా ఆర్ఐఓగా విధులను సమర్దవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువరు కళాశాలల నిర్వాహకులు, లెక్చరర్స్ అసోసియేషన్స్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఆర్ఐఓ మాట్లాడుతు జిల్లాలో అన్నీ ప్రయివేట్ జూనియర్ కళాశాలలు బోర్డు నిభందలన మేరకు పనిచేయ్యాలని, వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించకూడదని హెచ్చరించారు.

## అధిక ధరలు వసూలు చేస్తే, చర్యలు తప్పవు జెసి కార్తీక్



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త** శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ తమ చాంబర్లో అన్ని గ్యాస్ ఏజన్సీల నిర్వాహకులతో ఐవిఆర్ఎస్ సర్వే విషయమై సమీక్ష నిర్వహించడం జరిగినది. సిలిండరు డెలివరీ నిమిత్తము గ్యాస్ డెలివరీ బాయ్స్ వినియోగదారుల వద్ద అధిక ధరలు వసూలు చేయుచున్నారని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో అట్టి చర్యలు కట్టడి చేయుటకు తగు చర్యలు తీసుకోనవలసినదిగా సూచనలు జారీ చేసియున్నారు. ఆ మేరకు తగు చర్యలు చేపట్టనియెడల సదరు గ్యాస్ ఏజన్సీ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని హెచ్చరించడం జరిగింది. వినియోగదారులు గ్యాస్ బుకింగ్ చేసిన వెంటనే సకాలములో వారికి సిలిండరు డెలివరీ చేయవలెనని, నిర్ణీత రుసుము మాత్రమే వసూలు చేయవలెనని, ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు.

## అత్యుత్తమ ప్రతిభ చూపిన సాంఘిక సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసలు



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 25,ప్రభాతవార్త** ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్ విద్యార్థినీ విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ మెమెంటో, ప్రశంసాపత్రం అందజేశారు. ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ యం పి సి పరీక్షల్లో 961 మార్కులు సాధించిన నెల్లూరు సాంఘిక సంక్షేమ కేంద్ర ప్రభుత్వ హాస్టల్ విద్యార్థినిలు యాదల సంగీత, సి ఇ సి లో 927 మార్కులు సాధించిన బద్దిపూడి మేఘన, అలాగే పదవ తరగతిలో 574 మార్కులు సాధించిన వింజమూరు సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ విద్యార్థిని ఏ. నందిని, 568 మార్కులు సాధించిన ఉలవపాడు సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ విద్యార్థిని ఎన్. కాజోల్ లక్ష్మి అగర్వాల్, 565 మార్కులు సాధించిన ఆత్మకూరు సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ విద్యార్థి ఒంటెరు సాయి ధనుష్ తదితరులకు జిల్లా కలెక్టర్ తమ ఛాంబర్ లో ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ, ఇదే ఒరవడి కొనసాగించి భవిష్యత్తులో మంచి చదువులు చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ వారికి ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి శోభారాణి పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన నగర కమిషనర్ వై.ఓ. నందన్



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ. నందన్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌ని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

# దివ్యాంగులకు విపిఆర్ భరోసా

- కావలి నియోజకవర్గ దివ్యాంగులకు విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రై సైకిళ్ల పంపిణీకి సర్వం సిద్ధం
- కూటమి నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం
- 27న సమావేశానికి ముమ్మరంగా సాగుతున్న ఏర్పాట్లు
- హాజరు కానున్న ఎంపీ వేమిరెడ్డి, కావలి ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి



**నెల్లూరు రూరల్, ఏఫ్రిల్ 25, ప్రభాతవార్త** నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులకు భరోసానిస్తూ.. వారిలో ఆత్మ విశ్వాసం నింపేలా నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో చేపడుతున్న బృహత్తర కార్యం ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ల అందజేత కార్యక్రమం కావలి నియోజకవర్గానికి చేరుకుంది. ఈ నెల 27న ఆదివారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కావలి నియోజకవర్గ ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించనుండగా అందుకు సంబంధించి అన్ని వసతులు కల్పిస్తున్నారు. సభా ఏర్పాట్లు సాగుతుండగా, ఇప్పటికే సభా ప్రాంగణానికి ట్రై సైకిళ్లు చేరుకున్నాయి. అదేవిధంగా కావలి నియోజకవర్గస్థాయి తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. ఏ రాజకీయ నాయకులు ఎన్నికల్లో గెలిచిన తర్వాత నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించిన దాఖలాలు లేవు. కానీ నెల్లూరు పార్లమెంట్ సభ్యులుగా గెలిచిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాజకీయాల్లో సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి తన పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఎమ్మెల్యేల సహయ సహకారాలతో ఇప్పటికే కోవూరు, ఉదయగిరి, కందుకూరు, ఆత్మకూరు నియోజకవర్గాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించగా, ప్రస్తుతం ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి సహకారంతో కావలి నియోజకవర్గ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా జిల్లావ్యాప్తంగా దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందించే కార్యక్రమానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమ జరుగుతుండగా, ఇప్పటికే ఉదయగిరి, ఆత్మకూరు, కోవూరు, కందుకూరు నియోజకవర్గాల్లో దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లు అందించారు. ప్రస్తుతం కావలి నియోజకవర్గంలో దాదాపు 160 మంది దివ్యాంగులకు గుర్తించి వారికి ట్రై సైకిళ్లు అందించనున్నారు. ఇప్పటివరకు ఆయా నియోజకవర్గాల్లో దాదాపు 650 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందించారు. కావలి నియోజకవర్గానికి సంబంధించి ట్రై సైకిళ్ల పంపిణీ, ఆత్మీయ సమావేశం ఈ నెల 27న ఆదివారం ఉదయం 10గంటలకు కావలి పట్టణంలోని విశ్వోదయ ఇంజనీరింగ్ కాలేజ్ పక్కన ఉన్న గ్రౌండ్ నందు నిర్వహిస్తున్నారు. సమావేశానికి సంబంధించి ముమ్మర ఏర్పాట్లు జరుగుతుండగా, షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎండ నుంచి రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ట్రై సైకిళ్లు పంపిణీకి, ఆత్మీయ సమావేశానికి వేర్వేరుగా వేదికలు నిర్మిస్తుండగా సమావేశాలకు వచ్చేవారి కోసం ప్రత్యేకంగా భోజన వసతి కల్పిస్తున్నారు. ట్రై సైకిళ్ల లబ్ధిదారులకు ఉదయం టిఫిన్ కూడా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

## ఆత్మకూరులో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి





**ఆత్మకూరు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త** మే నెల 1వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆత్మకూరు పర్యటన సందర్భంగా అధికారులతో కలిసి ముందస్తుగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఏర్పాట్లు పరిశీలించారు. ఆత్మకూరు బీసీ బాలికల గురుకుల పాఠశాల వద్ద హెలీప్యాడ్, నారంపేట ఎం ఎస్ ఎం ఈ పార్క్ వద్ద హెలిపాడ్ స్థలాలను, కార్యక్రమ ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. నారంపేట వద్ద పైలాన్ ఆవిష్కరణ ఏర్పాట్లపై ఏపీఐఐసీ అధికారులతో మంత్రి చర్చించారు. అనంతరం ముఖ్యమంత్రి పింఛన్లు పంపిణీ చేసే నెల్లూరు పాలెం గిరిజన కాలనీలో మంత్రి పర్యటించారు. స్థానిక రామాలయంలో గిరిజన ప్రజలు, యువతతో మంత్రి మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజా వేదిక ఏర్పాటు కోసం ఆత్మకూరు ఏఎంసీ గ్రౌండ్ ను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఆత్మకూరు మెట్ట ప్రాంత యువత ఉజ్వల భవిష్యత్తు కోసం నారంపేట వద్ద ఎంఎస్ఎంఈ పార్కును ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని మంత్రి చెప్పారు. పారిశ్రామిక ప్రగతే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా 50 ఎం ఎస్ ఎం ఈ పార్కులను ఆత్మకూరు నుంచి సీఎం ప్రారంభించినట్లు చెప్పారు. నారం పేట ఎం ఎస్ ఎం ఈ పార్క్ వద్ద విద్యుత్, రోడ్లు, తాగునీరు మొదలైన మౌలిక వసతులు కల్పించి పెద్ద ఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టేందుకే ముఖ్యమంత్రి ఆత్మకూరులో పర్యటిస్తున్నారన్నారు. ఆత్మకూరులోని గిరిజన కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్వయంగా ఒకటి, రెండు గిరిజనుల నివాసాలకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని, ఆ కుటుంబాల ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తరఫున సీఎం భరోసా కల్పించనున్నారని ఆనం పేర్కొన్నారు. మే 1న మేడే కార్మిక దినోత్సవం పురస్కరించుకొని కార్మికులతో సీఎం ప్రత్యేకంగా సమావేశమై వారికి శుభాకాంక్షలు తెలుపనున్నారని, కార్మికులతో మమేకమై వారి సమస్యలను ముఖ్యమంత్రి తెలుసుకుంటారన్నారు. ఆత్మకూరు ఏఎంసీ గ్రౌండ్లో నిర్వహించే ప్రజా వేదిక కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటికి ముఖ్యమంత్రి పరిష్కారం చూపనున్నారని చెప్పారు. టిడిపి కార్యకర్తల సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొని పార్టీ భవిష్యత్ కార్యాచరణ, పార్టీ బలోపేతంపై ఒక గంటపాటు సుమారు 300 నుంచి 400 మంది కార్యకర్తల సలహాలు సూచనలు తీసుకుంటారని, ముఖ్యమంత్రి సలహాల మేరకు తెలుగుదేశం పార్టీకి ఆత్మకూరును కంచుకోటగా నిలిపేందుకు కృషి చేస్తాం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. సీఎం కార్యక్రమం పూర్తి వివరాలు త్వరలోనే పూర్తిస్థాయిలో ప్రకటిస్తామని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పావని, ఏపీఐఐసీ జడ్ ఎం శివకుమార్, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, డీఎస్పీ వేణుగోపాల్, స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉగ్రదాడిలో బలైన మధుసూధన్ కుటుంబానికి అండగా ఉంటాం

### ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు జి.సతీష్‌రెడ్డి



**కావలి, ఏప్రిల్25 ప్రభాతవార్త** ఉగ్రదాడిలో బలైన మధుసూధన్ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని, ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు జి.సతీష్‌రెడ్డి తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో బలైన సోమిశెట్టి మధుసూధన్ కుటుంబాన్ని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డితో కలిసి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశం నిర్వహించి సతీష్‌రెడ్డి మాట్లాడారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఎప్పటికప్పుడు మధుసూధన్ కుటుంబ యోగక్షేమాలు తెలుసుకుంటూ ఉన్నారని తెలిపారు. తానుకూడా దాడి సంఘటన, వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని ధైర్యం చెప్పడం జరిగిందన్నారు. గత కొద్దిరోజులుగా అందరూ కూడా ప్రభుత్వం నుంచి వస్తూ ఉన్నారన్నారు. మంత్రులు వచ్చి పరామర్శించి వెళ్లడం కూడా జరిగిందన్నారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి ఇక్కడే ఉండి అన్ని విషయాలు చూసుకుంటున్నారన్నారు. వైద్యులను నిరంతరం వారికి అందుబాటులో ఉంచుతూ వారి ఆరోగ్యంపై శ్రద్ధపెట్టడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లోకూడా మధుసూధన్ కుటుంబానికి ఏ రకమైనటువంటి సహాయం కావాలి, ప్రభుత్వంతో మాట్లాడి ఎలాంటివి చేయవచ్చో వాటిని కూడా చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నుండి అందవలసిన అన్ని సహాయసహకారాలు అందేలా చూస్తామన్నారు. అనంతరం కావలి ఎమ్మెల్యే దగుమాటి మాట్లాడారు. మధుసూధన్‌రావు మరణం కావలి పట్టణానికి శోకాన్ని మిగిల్చిందన్నారు. ఆ కుటుంబాన్ని ఏ విధంగా ఆదుకోవాలో ఆ విధంగా తప్పకుండా ఆదుకోవడం జరుగుతుందన్నారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గురించి బయటకు తీసుకువచ్చే విధంగా ప్రయత్నం చేస్తున్నారన్నారు. మధుసూధన్ కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అద్యక్షుడు గుత్తికొండ కిషోర్‌బాబు, బిజెపి జిల్లా టెలికాం సభ్యుడు కుట్టుబోయిన బ్రహ్మానందం, బిజెపి కావలి నియోజకవర్గ కన్వీనర్ సివిసి సత్యం, జనసేన జిల్లానేత సమ్మన వెంకటసుబ్బయ్య, జియస్‌టి సభ్యుడు, బిజెపినేత అమరా వెంకటసుబ్బా రావు, కావలి మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, మాజీ ఎఎంసి డైరక్టర్ తిరివీధి ప్రసాద్, టిడిపినేత నేరెళ్ల శేఖర్, కిరాణామర్చంట్స్ అసోసియేషన్ అద్యక్షుడు బల్సా ప్రసాద్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## 4.95 వేలు సిఎం రిలీఫ్ ఫండ్



**బుచ్చి ఏఫ్రిల్ 25 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ పంచాయితీ నందు నివాసం ఉన్న చాగంటి శివయ్య బ్రెయిన్‌కి సంబంధించిన ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. వారి పరిస్థితిని గుర్తించిన నెల్లూరు మదినా వాచ్ ఇంతియాజ్ కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకొని రాగా వారి పరిస్థితిని వివరించి ముఖ్యమంత్రి సహాయనిధి 4,95,000 రూపాయాలు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు. మదీనా వాచ్ అదినేత హాజి ఇంతియాజ్ కోవూరు ఎమ్మెల్యేకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## సీఎం చంద్రబాబుకి స్వాగతం పలికిన ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు రూరల్, ఏఫ్రిల్ 25, ప్రభాతవార్త** అమరావతి రాజధాని నిర్మాణ పనులకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఆహ్వానించేందుకు శుక్రవారం ఢిల్లీ చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సాదర ఆహ్వానం పలికారు. ఇతర నాయకులతో కలిసి ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సీఎంకి ఎంపీ వేమిరెడ్డి స్వాగతం పలికారు.

# తహసిల్దార్ కార్యాలయంలో కోర్టు రిట్‌పిటీషన్‌ల రికార్డు గల్లంతు

### అధ్వానంగా కార్యాలయ పనితీరు

**వలేటివారిపాలెం ఏప్రిల్ 25 ప్రభాతవార్త** వలేటివారిపాలెం మండల తహసిల్దార్ కార్యాలయంలో జగనన్న కాలనీ లేఔట్స్‌కి సంబందించిన కోర్టు రికార్డులు గల్లంతయ్యాయి.ఇందుకు సంబ oదించిన సమాచారం కార్యాలయంలో అందుబాటులోలేదని పౌరసమాచార అధికారి నాయబ్ రసూల్ తెలియచేశారు.సంవత్సరాల తరబడి భద్రంగా రికార్డుల్లో ఉండాల్సిన సమాచారం సంబందిత అధికారే అందుబాటులో లేదని చెప్పడం కార్యాలయ పనితీరుకు నిదర్శనం. వలేటివారిపాలెం మండలంలో గత ప్రభుత్వ హయాంలో జగనన్న లేఔట్‌ల నిమిత్తం లక్షలాదిరూపాయలు ప్రభుత్వ ధనం దుర్వినియోగమైంది.17 గ్రామాల్లో కాలనీల కోసం రూ.3.31కోట్లు విలువైన ప్రభుత్వభూమిని, రూ.1.54 కోట్లు విలువైన రైతలు భూమిని కొనుగోలు చేశారు.ఈ లే అవుట్‌ల ఏర్పాటులో అక్రమాలు జరిగాయని పలువురు హైకోర్టుకెళ్లారు.ఈ కారణంగా కొన్ని, అనువైన ప్రాంతాలలో లేఅవుట్‌లు వేయలేదని మరికొన్ని ఆగిపోయాయి. కేవలం అంకభూపాలపురం,కాకర్లపాలెంలో మాత్రమే అరకొరగా ఉన్నాయి.మిగిలిన గ్రామాల్లో వెచ్చించిన లక్షలాది రూపాయలు దుర్వినియోగం అయ్యాయి. పోలినేనిచెరువు, రామచంద్రాపురం,నవాబుపాలెం, పోలినేనిపాలెం, వలేటివారిపాలెం, చుండి, అయ్యవారిపల్లె, ఉప్పలపాడు, కొండసముద్రం, కూనిపాలెం, నూకవరం శింగమనేనిపల్లె, నలదలపూరు, శాఖవరం, కలవళ్ల గ్రామాల్లో సుమారు 66ఎకరాల్లో 37 లేఅవుట్‌లు చేశారు. కొండసముద్రం, కూనిపాలెం, పోకూరు, నూకవరం, శింగమనేనిపల్లె, శాఖవరం గ్రామాల్లో రైతులు నుంచి ఎ12-58 సెంట్ల భూమిని రూ.1కోటి 54లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు.వైసీపీ రైతులుకు చెందిన నిరుపయోగమైన భూములకు అధిక ధరలు చెల్లించారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి.ఈ నేపద్యంలో అక్రమంగా లేఅవుట్‌లు వేశారని తహసిల్దార్,సబ్‌కలెక్టర్,కలెక్టర్‌లను ప్రతివాదులుగా చేరుస్తూ పలువురు కోర్టుకెళ్లారు.కోర్టులో వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఈ నేపద్యంలో ఇందుకు సంబందించిన కోర్టు రిట్‌పిటీషన్ నంబరుల సమాచారం,లబ్దిదారులకు ఒక్కొక్కరికి ఎన్ని సెంట్లు కేటాయించారన్న సమాచారంపై సమాచారం హక్కు చట్టం ద్వారా వివరణ కోరగా కార్యాలయంలో అందుబాటులో లేదని డిప్యూటీ తహసిల్దార్ రాత పూర్వకంగా తెలియచేశారు.దీంతో సదరు రికార్డులు ఏమైనాయోనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఉన్నతాధికారులు నిజానిజాలు విచారించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



**ఎమ్మెల్యేకి పిర్యాదు:** రెవిన్యూ సిబ్బంది పనితీరు అధ్వానంగా ఉంది.ఈ మేరకు మంగళవారం అయ్యవారిపల్లెలో సచివాలయ ప్రారంభోత్సవ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు గ్రామస్తులు పిర్యాదు చేశారు.ఒక్క పని కూడా చేయడం లేదని ఆరోపించారు.దీంతో సంబందిత వీఆర్వోఅందుబాటులో లేకపోవడంతో తహసిల్దార్ అబ్దుల్ హమీద్‌ను ఫోన్‌లో వివరణ కోరారు.ఎమ్మెల్యే గ్రామంలోకి వస్తుంటే గ్రామ సిబ్బంది హాజరవాలన్న విచక్షణా జ్ఞానం సదరు అధికారులుకు కానీ, సిబ్బందికి గానీ లేకపోవడాన్ని ఎమ్మెల్యే ఆక్షేపించారు.ప్రజల కోసం పనిచేయని అధికారులు ఇక్కడెందుకు అని ప్రశ్నించారు. అధికారులుగానీ,సిబ్బందిగానీ చేయతగిన పనిని సకాలంలో చేయకపోతే వెంటనే తనకు ఫోన్ చేయాలని గ్రామస్తులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు.దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఎమ్యేలే ్యకి కృతజ్ఞతలు తెలిపారు.

## పంచాయతీ ఆస్తులను పక్కాగా గుర్తించాలి



**కోవూరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పంచాయతీలకు సంబంధించిన ప్రభుత్వ ఆస్తులను పక్కాగా గుర్తించి ఆ నివేదికను యుద్ధప్రాతిపదికన సమగ్రంగా అందజేయాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ సూచనల మేరకు జరుగుతున్న సర్వే కార్యక్రమాలను పారదర్శకంగా పూర్తిచేసేలా పంచాయతీ కార్యదర్శులు తగు చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా పారిశుధ్యం విషయంలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇటీవల కాలంలో పీజీఆర్ఎస్‌లో పారిశుధ్యానికి సంబంధించిన ఫిర్యాదులు కూడా వస్తున్నాయన్నారు. దీనిని వారు దృష్టిలో పెట్టుకోవాలన్నారు. అదేవిధంగా చెత్త నుంచి సంపద కేంద్రాలను మరింత అభివృద్ధి చేసేలా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమీక్షలో ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో అవగాహన పెంచాలి



**కోవూరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యకు సంబంధించిన పొదుపు గ్రూపు సంఘాల అధ్యక్షులతో ఏపీఎం సుబ్బరాజు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు గ్రూపులు కొత్త గ్రూపుల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన మార్పులకు అనుగుణంగా రైతులకు అవగాహన కల్పించేలా చూడాలన్నారు. అదేవిధంగా చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీపై శిక్షణ తీసేందుకు ఈ పొదుపు గ్రూపు సభ్యులు ముందుకు రావాలన్నారు. వీటి ద్వారా సంఘాల ఆదాయ అభివృద్ధిని పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా వ్యవసాయ సాగు ఖర్చులు తగ్గించి దిగుబడి పెంచేలా రైతుల్లో అవగాహన పెంచాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో అవగాహన పెంచి మేలు రకం ధాన్యం ఉత్పత్తిపై వారిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు చైతన్య, రాజశేఖర్, రాము, పొదుపు గ్రూపుల అధ్యక్షులు ఉన్నారు.

## వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలి





**కోవూరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు వారి వారి పరిధిలో టీబీ అనుమానితులను గుర్తించి వారికి ప్రత్యేక పరీక్షలను చేయించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని నెల్లూరు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డాక్టర్ ఎస్‌కే ఖాదర్‌వలి తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు వారి వారి పరిధిలో ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేలా చూడాల న్నారు. టీబీ అనుమానితులకు ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల సంబంధించిన పరీక్షలను ఉచితంగా చేయడం జరుగుతుందని, ఈ విషయంలో వారికి అవగాహన కల్పించాలన్నారు. టీబీ స్కిన్ టెస్ట్‌పై ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు మరింత అవగాహన చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఇర్ఫాన్ పలు సూచనలు చేశారు. అనంతరం ఇనమడుగు ఆరోగ్యకేంద్రంలో ఉన్న ప్రయోగశాలను పరిశీలించి ల్యాబ్ టెక్నీషియన్ నాగరాజుకు పలుసూచనలు చేశారు.

## ఎట్టకేలకు దుంపల కాలువ సర్వే ప్రారంభం



**కోవూరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** కోవూరులోని ప్రధాన డ్రైన్ అయిన దుంపల కాలువకు ఎట్టకేలకు కాలువ ఆధునీకరించేందుకు సర్వే బృందం మార్కింగ్ చేసే కార్యక్రమాన్ని ఎట్టకేలకు శుక్రవారం ప్రారంభించారు. ప్రధనంగా ఈ దుంపల కాలువ గతంలో ఎంతో విస్తీర్ణం కలిగి రైతుల పొలాలకు వెళ్లే కాలువగా ఉండేది. రాను రాను దీని స్వరూపమే పూర్తిగా మారిపోయింది. పంట కాలువ కాస్తా మురికి కాలువగా, డ్రైన్‌గా మారిపోయింది. దీనికి తోడు కాలువకు ఇరువైపుల ఉన్న గృహస్తులు ఈ దుంపల కాలువను ఎంతవరకు ఆక్రమించుకోవాలో అంతవరకు ఆక్రమించుకున్నారు. ప్రస్తుతం ఈ విషయానికి సంబంధించి ఈ ప్రాంతీయుడు రవి లోకాయుక్తలో కేసు దాఖలా చేశాడు. ఇటీవల ఈ దుంపల కాలువను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కూడా పరిశీలించి ఇరిగేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల సర్వే యర్ రమేష్ గౌడ్, గ్రామ రెవెన్యూ అధికారి శ్రీనివాసులురెడ్డి, గ్రామ సర్వేయర్లు రోవర్ ద్వారా కాలువ సర్వే కార్యక్రమాన్ని ఎట్టకేలకు ప్రారంభించారు. దీంతో ఈ దుంపల కాలువను ఆక్రమించుకుని ఉన్న ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. మొత్తం మీద ఈ సర్వే ఈ ప్రాంత వాసులకు తీవ్ర ఇబ్బందులు కలుగజేసింది.

## ప్రీ స్కూల్ కార్యక్రమాలను పారదర్శకంగా చేపట్టాలి



**కోవూరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** పూర్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు విద్యా బుద్ధులు అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు ఆటపాటలతో కూడిన విద్యను పారదర్శకంగా అందించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్. సువర్ణ అన్నారు. కోవూరు పంచాయతీ పరిధిలోని పెళ్లకూరు కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న ప్రతి చిన్నారి యొక్క బరువు ఎత్తులను ప్రతి నెల 10వ తేదీలోగా ఖచ్చితంగా తూచి ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. అదేవిధంగా ప్రతి కేంద్రం పరిధిలో ఉన్న గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించి వాటిని సక్రమంగా వారు తీసుకునేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకుని వాటిని ఆదర్శంగా తీర్చిదిద్దేలా అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ పరిశీలనలో ఆమె వెంట సీడీపీవో జ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

## గౌరవరంలో అనధికార మద్యం విక్రయాలపై దాడులు

**కావలి, ఏప్రిల్25 ప్రభాతవార్త :** కావలిరూరల్ మండలం గౌరవరం గ్రామంలో అనధికార మద్యం విక్రయాలపై ప్రొహిబి షన్, ఎక్సైజ్ అధికారులు శుక్రవారం ఆకస్మి కదాడులు నిర్వహించారు. జూటూరు కాంతా రావు వద్ద ఉన్న 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమో దుచేశారు. ఈ దాడుల్లో ఈ శాఖ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎస్.శ్రీనివాసులు, ఎస్ఐ ఎస్‌కె. బాషావలి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## స్పౌస్ పెన్షన్ కింద దరఖాస్తు చేసుకోవాలి



**కోవూరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని 2023 డిసెంబర్ 1వ తేది నుంచి 2024 అక్టోబర్ 31వ తేది వరకు పెన్షన్ పొందుతూ ఎవరైనా భర్త చనిపోయి ఉంటే వారి భార్యలు మాత్రమే స్పౌస్ పెన్షన్ కింద దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పెన్షన్ పొందుతూ ఈ మధ్య కాలంలో మరణించిన వారి భార్యకు మాత్రమే ఈ పెన్షన్ దరఖాస్తుకు అర్హులన్నారు. అటువంటి అర్హత కలిగిన వారు వారి వారి సచివాలయాల్లో దరఖాస్తుదారుని పేరు, మృతిచెందిన భర్త వివరాలు, డెత్ సర్టిఫికెట్, ఆధార్ నెంబర్, రైస్ కార్డు నెంబర్, గతంలో భర్త పొందుతున్న పెన్షన్ ఐడీ వివరాలతో సచివాలయంలో అందజేయాలన్నారు. పెన్షన్ రాకుండా చనిపోయిన భర్త యొక్క కుటుంబానికి నూతనంగా వితంతువు పెన్షన్ దరఖాస్తు చేసుకునేందుకు ఎటువంటి అనుమతి రాలేదని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

## భూసార పరీక్షలు రైతులకు ఉపయోగకరం






**కోవూరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** ప్రస్తుతం ఈ వ్యవసాయ సీజన్‌లో సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా మట్టి పరీక్షలను చేయించుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత అన్నారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామ సచివాలయంలో శుక్రవారం ఈ మట్టి పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తాము సాగు చేసే భూములకు సంబంధించి నిర్దేశించిన ప్రమాణాలతో మట్టిని తీసి ల్యాబ్ ద్వారా ఈ మట్టి పరీక్షలు చేయించుకోవాలన్నారు. దీని వలన ఆ మట్టిలో ఏమైనా లోపాలు ఉన్నాయా.. ఎటువంటి ఎరువులు వాడుకోవాలి అనే విషయాలు ఈ ప్రయోగశాలలోని పరీక్షల ద్వారా తేటతెల్లమవుతుందన్నారు. వాటికి అనుగుణంగా రైతులు ఎరువులను వాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి భూసార పరీక్షలు ఏ విధంగా చేసుకోవాలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు , గ్రామ రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు, రైతులు ఉన్నారు. అనంతరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించేల ర్యాలీ నిర్వహించారు.

## ఉగ్రవాదుల దాడికి నిరసనగా శాంతియుత ర్యాలీ



**వింజమూరు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో అశువులు బాసిన భరతమాత బిడ్డలకు ఘన నివాళులర్పిస్తూ ఉగ్రవాదుల దాడికి నిరసనగా వింజమూరు ఆటోమొబైల్స్ డీలర్స్ టెక్నికల్ వర్క్స్ వెల్ఫేర్ అసిసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సంఘీభావం తెలిపారు. స్థానిక బంగ్లా సెంటర్ నుండి పాత బస్టాండ్ వరకు సెల్ ఫోన్ టార్చ్ లైట్, కొవ్వొత్తులను వెలిగించి మౌనంగా ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్లో మానవహారం ఏర్పాటు చేసి భరతమాతాకు జై అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ భారతదేశం ఐక్యతను దెబ్బతీసేందుకు ఉగ్రవాదులు ఇటువంటి కుట్ర చేశారన్నారు. 28 మంది భారతీయులను ఎక్కడికక్కడ పేర్లు అడిగి మరి ఉగ్ర వాదులు పాశవికంగా చంపడం అత్యంత బాధాకరమన్నారు. దేశ చరిత్రలో ఏప్రిల్ 22ను చీకటి రోజుగా నిలిచిపోతుందన్నారు. ఇది పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఉగ్రవాదులను తుదముట్టించాలని ఇంకోసారి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ యూనియన్‌నాయకులు అంకినపల్లి రఘురాంరెడ్డి, గువ్వల రవీంద్రారెడ్డి, కదిరి రంగారావు, బ్రహ్మయ్య, ఉద్దగిరి శ్రీనివాసులు, షేక్ రఫీ, మదన్‌మోహన్, వెంకటయ్య, మల్లిఖార్జున, శ్రీనివాసులు, మహేంద్ర, ఈసీ మెంబర్లు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వుత్తులతో నిరసన




**బుచ్చి ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** పహల్గాంలో అమాయకుల్ని చంపిన ఉగ్రవాదుల్ని హతమార్చాలని ,ఉగ్రదాడులను ఖండిస్తు కొవ్వొత్తులతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు .ఈ కార్యక్రమంల లయన్స్‌క్లబ్ అధ్యక్షులు తిరివీధి సుబ్రమణ్యం నేతృత్వంలో నిర్వహించారు. అమాయకులైన యాత్రికుల్ని చంపిన కిరాతకుల్ని కేంద్ర ప్రభుత్వం హతమార్చాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ట్రెజరర్ సరాబు వెంకటనాగేశ్వరరావు, పాస్టు ప్రెసిడెంట్ పైడా రవీంద్రబాబు, దర్శిబాలు, సప్తగిరి వెంకటేశ్వర్లు,ఇనుగూరు సుబ్బారావు, తన్నీరు ప్రసాద్,దర్శి వెంకటేశ్వర్లు, తిరివీధి రాజేంద్ర, తెలనాకుల మురళీ,అచ్చుత్ సుబ్బయ్య, దర్శి నరసింహరావు , లయన్స్ క్లబ్ మెంబర్లు పాల్గొన్నారు.

## మధుసూదన్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఏ పి ఎన్ జి జి ఓస్



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** జమ్మూకాశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారితో పాటు కావలికి చెందిన మధుసూదన్ కుటుంబ సభ్యులకు ఏ పి ఎన్ జి జి ఓస్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా పక్షాన ప్రగాఢ సానుభూతి తెలియచేసి అనంతరం సాయంత్రం కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు జిల్లా కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ అసోసియేట్ అధ్యక్షులు నందిమండలం ఆంజనేయవర్మ కోశాధికారి ప్రసాద్ రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్కాకుల పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పహల్గాంలో ఉగ్ర దాడిని నిరసిస్తూ ఉదయగిరిలో ర్యాలీ



**ఉదయగిరి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ మృతి చెందిన వారికి సంతాప సూచికంగా ఉదయగిరిలోని బస్టాండ్ సెంటర్లో శుక్రవారం మానవహారం శ్రీకృష్ణదేవ రాయల దేవాలయం నుండి స్థానిక బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక అధ్యక్షతన చేపట్టింది. ఇందులో భాగంగా ఉదయగిరి నియోజకవర్గంలో కుల మతాలకు అతీతంగా మాట్లాడుతూ ఐక్యవేదిక పిలుపు మేరకు సంతాప దినాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ఉదయగిరి పట్టణంలో తీవ్ర వాదులు దాడిలో మృతి చెందిన వారికి సంతాపం తెలియజేస్తూ ర్యాలీ చేపట్టడం జరిగిందని కాశ్మీర్ పర్యాటకులను, ముష్కరులు కాల్చి చంపటం దారుణమని, మృత్యులకు ఆత్మ శాంతి కలగాలని కోరుతూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామన్నారు. దేశంలో ఉగ్రవాదులను అణిచివేయాల్సిన అవసరం ఉందని, పర్యాటకులపై విచక్షణరాహితంగా కాల్పులు జరపడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. మృతుల్లో కావలి వాస్తవుడు జన సైనికుడు సోమిశెట్టి మధుసూదన్‌రావు ఉండటం, అత్యంత బాధాకరమని తెలిపారు. వారికి సంతాపం తెలియజేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షేక్ రియాజ్ బయన్న, బీజేపీ నాయకులు రోశయ్య, ఉదయగిరి మండల ఎమ్మార్పీఎస్ నాయకులు బకీర్ జాషువా, సీఈఎం నాయకులు కాకు వెంకటయ్య, ఉదయగిరి బిట్టు వన్ ఎంపీటీసీ తిరుపతయ్య, మాజీ వక్ఫ్ బోర్డు డైరెక్టర్ గడియాల్సి ఎస్‌దాని, ఉదయగిరి ఉప సర్పంచ్ ముత్తుజ హుస్సేన్, షంషీర్, హజరత్, ఉదయగిరి మండల నియోజకవర్గంలోని ఉదయగిరి మండల జనసేన కార్యకర్తలు, కాంగ్రెస్ నాయకులు, టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు ముస్లిం మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం




**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** జమ్మూకాశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన భారతీయులలో ఆంధ్రపదేశ్ నెల్లూరు జిల్లా కావలికి చెందిన మధుసూదన్ కుటుంబ సభ్యులకు మరియు అదే ఉగ్ర దాడిలో మరణించిన ఇతర భారతీయుల కుటుంబ సభ్యులకు ఏ పి ఎన్ జి జి ఓస్ అసోసియేషన్ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పక్షాన ప్రగాఢ సానుభూతి తెలియచేసి కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేయడం జరిగింది.

## ఆర్యవైశ్య ఆణిముత్యాలకు వైశ్యనేతల సత్కారం



**కావలి, ఏప్రిల్25 ప్రభాతవార్త :** విట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, కావలి మండల ఆర్యవైశ్యసంఘం ప్రోగ్రాం కన్వీనర్ వివి సునీల్‌కుమార్, కళ్యాణి దంపతుల పిల్లలు సిరిజాహ్నవి, జస్వంత్‌గుప్తాలు ఇంటర్మీడియట్, టెన్త్‌క్లాస్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి ఆర్యవైశ్య ఆణిముత్యాలుగా బావుటాను ఎగురవేశారు. శుక్రవారం కావలి వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయకమిటి సభ్యులు ఈ ఇద్దరు విద్యార్థులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఇంటర్మీడియట్‌లో కుమార్తె సిరిజాహ్నవి 988/1000, కుమారుడు జస్వంత్‌గుప్తా పదవ తరగతిలో 583/600 మార్కులు సాధించి ప్రత్యేకతను చాటిచెప్పారు. కావలి వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీసభ్యులు వారిని దుశ్శాలువాలతో సత్కరించి పండ్లు అందచేసి అభినందించారు. ఈ విద్యార్థులు బాగా చదువుకుని మంచి ర్యాంకులు సాధించి ఉన్నతశిఖరాలకు చేరుకుని తల్లిదండ్రులకు, కావలికి మంచిపేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కావలి వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయకమిటి సభ్యులు అమరావేదగిరి సుబ్బరాయుడుగుప్తా, నల్లూరు రోశయ్య, రాజారమణయ్య, బొగ్గవరపు సత్య నారాయణ (బాలాజి హైరర్స్), ఏల్చూరి రవి, కందుకూరి సుబ్బుసత్యనారాయణబాబు, ఓరుగంటి సురేష్, పొత్తూరు సురేంద్ర, పెంద్యాల వేమారావు, ఆర్యవైశ్యసంఘం కమిటీసభ్యులు చీదెళ్ల సాయి, తదితరులు పాల్గొన్నారు.

## ఎఎస్ఐ సతీమణి రజని చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



**కావలి, ఏప్రిల్25 ప్రభాతవార్త :** కావలి పట్టణం పాతవూరుకు చెందిన ఎఎస్ఐ చెలికల సాయి కుమార్ సతీమణి రజని ప్రథమ సంవత్సరీక కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొని చిత్రపటంవద్ద పూలు ఉంచి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డులా ఉదయగిరి అటవీ ప్రాంతం



**ఉదయగిరి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలోని కావలి హైవే కరెంట్ ఆఫీసు సమీపంలో అటవీ ప్రాంతం లో డంపింగ్ యార్డును తలపిస్తుంది. ఉదయగిరిలో చికెన్, చేపలు, కొబ్బరిబొండాలు వ్యాపారాలు వ్యర్థాలను కరెంటు ఆఫీసు సమీపంలోని హైవే వద్ద పడేయడంతో దుర్వాసన వెదజల్లటం మొదలైందని పట్టణం వాసులు వాపోతున్నారు. పలుమార్లు అటవీ శాఖ అధికారులు చెప్పినా ఆయా వ్యాపారులకు నోటీసులు జారీ చేసిన వ్యాపారస్తులు దాన్ని పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని వ్యాపారస్తులకు చెప్పి నిలుపుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఉగ్రదాడిని ఖండిస్తూ బిజెపి ఆధ్వర్యంలో క్యాండిల్స్ ర్యాలీ



**అల్లూరు,ఏప్రిల్ 25,ప్రభాతవార్త:** కాశ్మీర్లోని పెహల్గామ లో పర్యాటకులపై జరిగిన ఉగ్ర దాడిని ఖండిస్తూ శుక్రవారం అల్లూరు మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు యువ మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కత్తుల కిరణ్ నాయుడు మరియు హిందూ చైతన్య వేదిక సహాయ సహకారాలతో ర్యాలీ గా బయలుదేరి ఉగ్ర దాడిని ఖండిస్తూ కోనేరు సెంటర్ నుండి పాత బస్టాండ్ ట్యాంక్ సెంటర్ మీదుగా అల్లూరుపేటలోని అల్లంపాటి విజయవర్ధన్ రెడ్డి నివాసం వరకు ర్యాలీ నిర్వహించారు ఉగ్ర దాడిలో మరణించిన 28 మందికి ఆత్మ శాంతి కలగాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ రెండు నిమిషాలు పాటు మోనం పాటించారు అదేవిధంగా హిందువుల ఐక్యత వర్ధిల్లాలని పిలుపునిచ్చారు ఉగ్రవాదానికి అజ్యం పోస్తున్న పాకిస్తాన్ కు కేంద్ర ప్రభుత్వం సరైన సమాధానం ఇస్తుందని బిజెపి నాయకులు తెలిపారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు దేవళ్ళ హరిప్రసాద్ రెడ్డి. హిందూ చైతన్య సంఘ సభ్యులు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సోమిరెడ్డి



**మనుబోలు ఏప్రిల్ 25 ప్రభాతవార్త** ఎస్‌టి,ఎస్‌సి ,బిసి మైనార్టీ సంఘాల వారి సమస్యలపై పోరాడాలని అని పిలుపునిచ్చిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో అంబేద్కర్ యువత సుమన్‌తేజా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని సోమిరెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు దళితుల సమస్యలపై ఆయా సంఘాలు పోరాడాలని వారికి తమ మద్దతు ఎల్లవేళలా ఉంటుందని అన్నారు. గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు అభినందనీయమని అన్నారు. గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి ఎస్‌సి,ఎస్‌టి కమీషన్లు ఎత్తివేసారని విమర్శించారు. సర్వేపల్లిలో కాకాణి పాపాలు చేసి కనుమరుగయ్యాడని ఎద్దేవ చేశాడు. నాపైన అక్రమంగా 18 కేసులు పెట్టిన ధైర్యంగా ఎదుర్కొన్నానని తెలిపారు. సోమిరెడ్డి మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. 10 లక్షలతో నిర్మించిన సిసిరోడ్డును ప్రారంభించారు. కలికి వేణురెడ్డి,పోన్నూరు అశోక్ గజమాలలతో ఎమ్మెల్యేను సత్కరించారు. ఈకార్యక్రమంలో గాలి రామకృష్ణారెడ్డి, పి రామకృష్ణయ్య ,మస్తాన్‌నాయుడు, చేరెడ్డి రామిరెడ్డి, మధునాయుడు,పచ్చిపాల రామిరెడ్డి,పచ్చిపాల చంద్రశేఖర్‌రెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్, శివుడు రాజా, గౌడ్‌సానే వెంకటరమణయ్య, మహేంద్ర,నూనె లక్ష్మయ్య విజయ్,చల్లగిరి ప్రసాద్, బండికట్టు రవి,మసూమ్‌సాహెబ్ ,అమీర్‌బాషా, కొదండ రామిరెడ్డి, ప్రవీణ్, చైతన్య పెద్దఎత్తున అంబేద్కర్ యువత పాల్గొన్నారు.

## రేషన్ కార్డుదారులు ఈ కేవైసీ చేసుకోవాలి: తహసిల్దార్



**కొడవలూరు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** మండలంలో ప్రతి రేషన్ కార్డ్ దారులు ఈ కేవైసీ నమోదు చేసుకోవాలని మండల తహసిల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు. ఈ కేవైసీ వలన ప్రజ లకు రాష్ట్ర ప్రభుత్వం అందించే పథకాలు అందడం జరుగు తుందని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చేసుకోవాలని కోరారు. రేషన్ సరుకులు పంపిణీ లో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవన్నారు. మండలంలో ఉన్న రేషన్ దుకాణాలను తనిఖీలు చేయడం జరుగుతుందని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే పేద ప్రజల బియ్యం పంపిణీలో గ్రామాల డీలర్లు నిర్లక్ష్యం, అవినీతికి పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహశీల్దార్ తెలిపారు.

## 27 న సుశీల నేత్రాలయ వారి కంటి వైద్యశిబిరం

**బుచ్చి ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం నగర పాలక పంచాయితీలో ఈనెల 27 వ తేది ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యహ్నం 3 గంటల వరకు ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ పి.సుధాకర్‌రావు తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా కంటి ఆపరేషన్ ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. కంటి పరీక్షకు వచ్చే వారు తప్పని సరిగా ఆరోగ్యశ్రీకార్డు,ఇహెచ్ఎస్ కార్డు,ఆధార్‌కార్డు తీసుకొని రావాలని వారు సూచించారు.

## దివ్యాంగులు ట్రైసైకిళ్ల పంపిణి కార్యక్రమానికి హాజరుకావలెను



**కావలిరూరల్, ఏప్రిల్25 ప్రభాతవార్త :** ఈ నెల 27వ తేది ఆదివారం ఉదయం 7 గంటలకు కావలి ఉదయగిరి రోడ్డులోని మినీస్టేడియంనందు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దాతృత్వంతో దివ్యాంగులకు ఎలక్ట్రానిక్ ట్రైసైకిళ్ల పంపిణి కార్యక్రమం జరుగుతుందని ఫోన్ వచ్చిన ప్రతి దివ్యాంగులు తప్పనిసరిగా హాజరుకావలెనని కావలి ముసునూరు దివ్యాంగుల కాలనీ అధ్యక్షులు, టిడిపి విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షులు మండల వెంకటరావు ఒక ప్రకటనలో శుక్రవారం తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దివ్యాంగులకు అండగా ఉండేందుకు ఈ కార్యక్ర మంలో దివ్యాంగులకు 175 ట్రైసైకిళ్ల నుండి 200 వరకు ఇవ్వడం జరుగుతుందని తెలియచేశారు. ఆయన ఇప్పటివరకు నెల్లూరు పార్లమెంట్ పరిధిలో దాదాపు వెయ్యి ట్రైసైకిళ్లను తన స్వంత నిధులతో అందచేయడం జరిగిందని తెలియచేశారు. దివ్యాంగుల తరపున ఆయనకు ధన్యవాదాలు తెలియచేయడమే కాకుండా ఎల్లవేళలా రుణపడి ఉంటామని తెలియచేశారు. ఈ ట్రైసైకిళ్ల పంపిణి కార్యక్రమానికి వచ్చే దివ్యాంగులు ప్రతిఒక్కరూ ఒక వ్యక్తిగత సహాయకుడిని వెంటతీసుకుని రావలెనని తెలియచేశారు. వచ్చేవారందరిరికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనంతోపాటు ఆటో రవాణాకు వెయ్యిరూపాయలు నగదులు అందచేయడం జరుగుతుందని తెలియచేశారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి దివ్యాంగులకు ఏ కష్టం వచ్చినా ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్నారని తెలియచేశారు. ఆయన ఆధ్వర్యంలో కావలి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం శరవేగంగా ముందుకు వెళుతుందని తెలియచేశారు. రోడ్లు, నీటివసతి, ఆపదలో ఉన్నవారికి సిఎం రిలీఫ్‌ఫండ్ ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని తెలియచేశారు. ఇటీవల 2వ సారి ఎమ్మెల్సీగా ఈ ఎన్నికైన బీద రవిచంద్ర దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు ఇచ్చేందుకు ఒక ప్రణాళికను రూపొందిస్తున్నందున చాలా సంతోషంగా ఉందని తెలియచేశారు. దివ్యాంగులకు అండగా ఉంటున్న ఇలాంటి నాయకులకు సముచిత స్థానం కల్పిస్తున్న సిఎం నారా చంద్రబాబునాయుడు, యువనాయకులు నారా లోకేష్‌బాబులకు రాష్ట్రంలో, కావలి నియోజకవర్గంలోని దివ్యాంగులు ఎల్లవేళలా అండగా ఉంటూ రుణపడి ఉంటారని తెలియచేశారు.

## పరిసరాల పరిశుభ్రతతో మలేరియాను అరికట్టవచ్చు



**నెల్లూరు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త-వైద్యం :** మన ఇంటి చుట్టుపక్కల ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకుంటే దోమల ద్వారా వ్యాపించే మలేరియాను అరికట్టవచ్చని మెడికవర్ హాస్పిటల్ కన్సల్టెంట్ ఫిజిషియన్ అండ్ డయాబెటాలజిస్టు డాక్టర్ పెంచల ప్రసాద్, డాక్టర్ రవీంద్రరెడ్డి, డాక్టర్ విజయకుమార్ హెచ్చరించారు. శుక్రవారం మెడికవర్ ఆసుపత్రిలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురష్కరించుకుని అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. దోమల ద్వారా వ్యాపించే మలేరియా వ్యాధి కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఏటా 6 లక్షల మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని చెప్పారు. ముఖ్యంగా 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు మలేరియా భారిన పడుతున్నారని వెల్లడించారు. దోమకుట్టిన 10 రోజుల తర్వాత జ్వరం, తలనొప్పి, చలి లక్షణాలతో మలేరియా బయటపడుతుందని, ఆ సమయంలో వైద్యులను సంప్రదించకుండా నిర్లక్ష్యం చేస్తే రాను రాను అలసట, మూర్ఛపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, కళ్లు, చర్మం పసుపు రంగులోకి మారడం కనిపిస్తుందన్నారు. మలేరియా వ్యాధి తీవ్రమైతే కాలేయం, కిడ్నీలు, మెదడు లాంటి అవయవాలు కూడా దెబ్బతింటాయని హెచ్చరించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి ఇంట్లోకి దోమలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. మలేరియా వ్యాధికి కారణమయ్యే అనాఫిలిస్ దోమలు కుట్టకుండా శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు ధరించాలని దోమతెరలను ఉపయోగించాలని సూచించారు. మలేరియాకు చికిత్స కన్నా నివారణే సులభమని, నివారణ మార్గాల ద్వారా మలేరియా సోకకుండా చూసుకోవాలన్నారు. అధిక జ్వరం, వణుకు వస్తుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్ రెడ్డి, ఫిజిషియన్ విభాగం వైద్యులు సిబ్బంది, పీఆర్వో చందు వర్మ పాల్గొన్నారు.

## మోటార్లు దొంగలు ఒకే.. ట్రాన్స్‌ఫార్మర్ దొంగల పరిస్థితి ఏంటీ..?



**తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** ఇటీవల కాలంలో తోటపల్లిగూడూరు మండలంలోని చుట్టుపక్కల గ్రామాలలో ఉన్న పొలాలలో మోటార్లు దొంగతనాలు ఉక్కువ అయ్యాయని తోటపల్లిగూడూరు పోలీసులకు పలువురు రైతులు ఫిర్యాదు చేయడం జరిగింది. అయితే ఆ ఫిర్యాదు అందుకున్న తోటపల్లిగూడూరు ఎస్సై వీరేంద్రబాబు ముత్తుకూరు సీఐ రవినాయక్‌కు సమాచారం అందించడంతో తోటపల్లిగూడూరు ఎస్సై వీరేంద్రబాబుతో సహ పలువురిని టీములుగా విభజించి ముత్తుకూరు సర్కిల్ గట్టి నిఘా ఏర్పాటు చేశారు. అయితే ఈ మోటార్ల దొంగలు సీఐ ఏర్పాటు చేసిన నిఘా టీంలో ఒకరైన తోటపల్లిగూడూరు ఎస్సై వీరేంద్రబాబు వారి సిబ్బంది ఒక రోజు రాత్రి గస్తీ తిరుగుతూ ఉండగా వారికి ముగ్గురు వ్యక్తులు తారాసపడడంతో వారిని స్టేషన్‌కు తరలించి సీఐ ఆధ్వర్యంలో విచారించగా 5 లక్షల రూపాయలు విలువ చేసే 25 మోటార్లు దొరికిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు కొత్తగా పొలాలలోని ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి వాటిలో ఉన్న విలువైన రాగి వస్తువులను దొంగలించుకు వెళ్లారని తోటపల్లిగూడూరు మండలం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ తోటపల్లిగూడూరు పోలీసులకు అలాగే ఎలక్ట్రిసిటీ అధికారులకు సమాచారం అందించారు. రైతులు ఇచ్చిన సమాచారం మేరకు తోటపల్లిగూడూరు మండలంలోని కోడూరు పంచాయతీలో పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు దొంగిలించుకు తీసుకెళ్లి వాటిని పగలగొట్టి అందులోని విలువైన సామాగ్రిని తీసుకెళ్లారని కొన్ని చోట్ల అయితే స్తంభాలకు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు అలాగే పెట్టి కరెంటు వేలు కత్తిరించి అందులోని విలువైన రాగి వైరు ఇతర పరికరాలను తీసుకెళ్లారని రైతులు గగ్గోలు చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు రైతులు పొలాలు వేసుకుని పంట చేతికి వచ్చేంతవరకు భాగానే ఉన్నాయని ఇప్పుడు పంట చేతికి వచ్చేసి పొలాలు ఖాళీగా ఉండడంతో దొంగలు ఇది అనువుగా చూసుకుని ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలకు పాల్పడుతున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. మాకు ఇప్పుడు వెంటనే రెండో పంట వేసుకునేందుకు మేము ప్రయత్నాలు సాగిస్తున్న ఈ తరుణంలో ట్రాన్స్‌ఫార్మర్లు దొంగలు ఎత్తుకు వెళ్లడం వల్ల ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతులుగా మేము ఎన్నో ప్రయాసాలకు ఓర్చి అతి కష్టం మీద ట్రాన్స్‌ఫార్మర్లు సంబంధిత అధికారులు చుట్టూ తిరిగి బిగించుకుంటే ఇప్పుడు దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తుకు వెళ్లడం వల్ల ఏమి చేయాలో దిక్కు తోచక అర్థం కాని స్థితిలో ఉన్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి పోలీసు అధికారులు ఎలక్ట్రిసిటి అధికారులు తమకు న్యాయం చేసి ట్రాన్స్‌ఫార్మర్లు బిగించుకునే వెసులుబాటు మాకు కనిపించాలని శుక్రవారం తోటపల్లిగూడూరు పోలీసులను అలాగే ఎలక్ట్రిసిటీ అధికారులను మండలంలోని రైతులు వేడుకున్నట్లు వారు తెలిపారు.

## జమ్మూకాశ్మీర్ మారణ హోమానికి నిరసనగా జనసేన నిరసన ర్యాలీ



**కలిగిరి, ఏప్రల్25, ప్రభాతవార్త;** మొన్న జమ్మూ కాశ్మీర్‌ల్లో జరిగిన మారకాండకు నిరసనలు తెలువు తూ శుక్రవారం కలిగిరిలో జనసేన ఆద్వర్య ంలో నిరసన శాంతిర్యాలీలు నిర్వహిం చారు. కలిగిరి బస్టాండు సెంటర్లో జనసేన, టిడిపి, బిజెపి ఇతర స్వచ్చంద సంస్తలు కలసి నిరసనర్యాలీ చేపట్టారు .జాతీయ జండాలు చేతబట్టి ముష్కరుల చేతుల్లో అశువులు బాపిన భారతీయ ప్రజలకు ఘనంగా నివాళులు అర్పించారు. అదే విదంగా పల్వామా దాడిలో చనిపోయిన కుటుంబాలకు నివాళులు అర్పించారు.మానవ హారం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూజమ్మూకాశ్మీర్‌లో జరిగన దాడి పిరికి పంద చర్యగా అబివర్ణించారు. శాంతికి మారుపేరైన భారత దేశంపై ఇలాంటిదాడులు జరిపితే ఈ దాడులకు భారతీయులు భయపడరని అదేరీతిలో భారతీయులు తగినరీతిలో బుద్ది చెబుతారని హెచ్చరించారు.ఈ ఆర్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు బండారు లక్ష్మీన్నారాయణ, జనసేన నాయకులు కొట్టే వెంకటే శ్వర్లు,టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బిజ్జంక్రిష్ణారెడ్డి, మాజీ అధ్యక్షులు కొండపల్లి వెంక్రటావు,బండారు మల్లికార్జున, జనసేన నాయకులు కూటమినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళల సమస్యలపై అవగాహన కార్యక్రమం



**కావలిరూరల్, ఏప్రిల్25 ప్రభాతవార్త :** శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా ఐసిడియస్ పిడి, డిఆర్‌డిఏ పిడి సూచనలమేరకు కావలి మండల ఏపిఎం పివి కృష్ణారావు ఆధ్వర్యంలో కావలి మండల సమాఖ్య అధ్యక్షురాలు డి.థెరీస్సా అధ్యక్షతన శుక్రవారం కావలి మండల సమాఖ్య కార్యాలయంనందు 42 సంఘాలనుంచి వచ్చిన అధ్యక్షులు, కార్యదర్శులు, వీవోఏలు, గ్రూప్ సభ్యులకు మహిళల సమస్యలపై మహిళలకు సంబంధించిన చట్టాలపై అవగాహన, శిక్షణాకార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సఖివన్ స్టాఫ్ సెంటర్ నుండి జి.సాధన, ఐసిడియస్‌నుంచి పి.మంజుల పాల్గొని సిబ్బందికి ఫోక్సో యాక్ట్ గురించి, ఛైల్డ్ హెల్ప్‌లైన్ సెంటర్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్‌సెంటర్ 181 112 సైబర్‌క్రైం, ఛైల్డ్‌మ్యారేజ్ ప్రొహిబిషన్ యాక్ట్ గురించి వివరించడం జరిగింది. బాల్యవివాహాల నష్టాలను వాటిని అరికట్టుటకు అందరూ తీసుకోవాల్సి న చర్యలు బాల్య వివాహాలు జరిపించివారిపై ఎటువంటి చట్టాలు వర్తింపచేస్తారు వారికి పడే శిక్షగురించి, జరిమానాల గురించి వివరించడం జరిగింది. లైంగిక వేధింపులనుండి ఏ విధంగా రక్షణ కలిగించుకోవాలి, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ అందరికి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సమావేశంలో అదే విధంగా నెలవారి జరిగే సంఘమిత్ర ఈసీ సమావేశంలో ఉల్లాస్, సూర్యఘర్, బ్యాంకు లింకేజి, శ్రీనిధి మొదలగు కార్యక్రమాల గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి సూపర్‌వైజర్లు కృష్ణమ్మ, విజయలక్ష్మి, సిసిలు ఎస్‌కె.రసూల్, మాలకొండయ్య, చిరంజీవి, ప్రసాద్, మాల్యాద్రి, శివయ్య, అంగన్‌వాడి టీచర్లు, సంఘమిత్ర ఓబీలు సంఘబంధాల అధ్యక్షురాళ్లు, వివోలు పాల్గొనడం జరిగింది.

## మలేరియా అంతం మనతోనే సాధ్యం



**నెల్లూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త -వైద్యం :** మన ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు వ్యాపించమని తద్వారా మలేరియాని నియంత్రించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వంగల సుజాత తెలిపారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురష్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓ నేతృత్వంలో మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించబడింది. ఈ ర్యాలీ సంతపూట నుండి గుప్తా పార్కు వరకు సాగింది. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వంగల సుజాత మాట్లాడుతూ మలేరియా అంతం మనతోనే సాధ్యం అని నినాదంతో ప్రజలందరూ చురుగ్గా సహకరించాలన్నారు. మలేరియా వ్యాధి ఎనాఫిలిస్ ఆడ దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందుతుందని, దాని వల్ల చలి, వాంతులు, వణుకు, తీవ్రమైన జ్వర లక్షణాలు ఉత్పన్నమవుతాయని చెప్పారు. దోమ కాటుకు 8 నుండి 12 రోజుల్లో లక్షణాలు బయటపడతాయని, అలాంటి సమయంలో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకోవాలని సూచించారు. మలేరియా నివారణ, నియంత్రణ, నిర్మూలన కోసం ప్రభుత్వ ఆరోగ్యశాఖ నిబద్దతతో పనిచేస్తోందని ప్రజలు సహకరిస్తే 2030 నాటికి దేశంలో మలేరియాను పూర్తిగా నిర్మూలించవచ్చని అన్నారు. మలేరియా నిర్మూలన మన చేతిలో ఉంది. ప్రజల్లో మార్పు రావాలి, మనకు ఉన్న వనరులతో ఉత్తేజంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, దోమలు కుట్టకుండా, వాటి వృద్దిని అడ్డుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్ఓ షేక్ ఖాదర్ వలి, పీఎల్ దయాకర్, డెమో కనకరత్నం, అసిస్టెంట్ మలేరియా అధికారి వి.నాగార్జునరావు, జిల్లా పీఎంపీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, తదితర అధికారులు, మలేరియా, సిబ్బంది ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ శ్రామికులకు కేంద్ర పథకాలను అమలు చేయాలి



**వింజమూరు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న శ్రామికులందరికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన పథకాలను తప్పనిసరిగా నమోదు చేయించాలని ఉపాధి హామీ సిబ్బందికి ఎంపీడీఓ కే.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మే నెల 1వ తేదీ నాటికి ఈ కార్యక్రమం పూర్తి చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ఉపాధి హామీ శ్రామికులందరికి ప్రీమియం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. 18 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల లోపు శ్రామికులు సంవత్సరం చందాగా 20 రూపాయలు చెల్లించి సభ్యులుగా చేరవచ్చన్నారు. ఈ పథకం ద్వారా ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2లక్షల రూపాయలు నామినీకి అందజే యబడుతుందని తెలిపారు. అదేవిధంగా ప్రధానమంత్రి జీవనజ్యోతి సురక్ష యోజన పథకం కింద 18 నుండి 50 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు సంవత్సరానికి 436 రూపాయలు చెల్లించి సభ్యునిగా చేరాలన్నారు. ఈ పథకం ద్వారా ప్రమాద మరణం జరిగినట్లయితే లేదా సాధారణ మరణం జరిగిన రెండు లక్షల రూపాయలు నామినీకి అందజేస్తారని తెలిపారు. ఒక పథకం లేదా రెండు పథకాలలో చేరవచ్చని తెలియజేశారు. కావున ఉపాధి హామీ శ్రామికులందరూ ఈ అవకాశాన్ని సద్వినియో గపరుచు కోవాల్సిందిగా ఎంపీడీఓ కోరారు.

## ఫిష్ పాండ్ పనులను పరిశీలించిన ఏపీవో



**వింజమూరు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** వింజమూరులోని ఉత్తర హరిజనవాడ ప్రాంతంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులలో భాగంగా జరుగుతున్న ఫిష్ పాండ్ పనులను ఏపీవో సుభాషిణి పరిశీలించారు. ఉపాధి హామీ శ్రామికుల మస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ ఉపాధి హామీ శ్రామికులు ఉద యాన్నే ఆరు గంటలకు పనులకు వెళ్లి 10 గంటల వరకు పనులు చేయాలని తెలిపారు. నిర్దేశించిన సమయం వరకు పనిచేస్తున్నట్లయితే రూ.307 రూపాయలు కూలి వస్తుందని తెలిపారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేయాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట క్షేత్ర సహాయకులు చంద్రశేఖర్ ఉన్నారు.

## రైతులు మట్టినమోనాలను పరీక్షలు చేయించుకోవాలి;ఏఓసురేష్‌బాబు.



**కలిగిరి, ఏప్రేల్25, ప్రుభాతవార్త;** రైతులు వారియ పొలాల్లోని మట్టినమూనాలను పరీక్షించు కోవాలని కలిగిరి మండల వ్యవసాయా ధికారికె. సురేష్ బాబు తెలిపారు. శుక్రవారం మండలం లోని వెలగపాడు, పెద్దకొండూరు రైతు సేవా కేంద్రా లలో మట్టినమోనాలపై రైతుల తోసమా వేశాలు నిర్వహించారు.ఈసందర్బంగా ఏఓ మాట్లాడుతూ రైతులుతమ పొలాల్లోని మట్టిని పరీక్షలు జరింపిం చుకొని పంటలు వేసుకుంటేఅధిక దిగుబడులు వస్తాయన్నారు.రైతులు అదికంగా వరి పంటపై శ్రద్ద చూపుతు న్నారన్నారు.వరి పంటకుబదులు ప్రత్యామ్నయ పంటలపై అధిక దృష్టి పెట్టాలన్నారు. వరికి అధికంగా నీరు అవరమన్నారు. ఇక్కడ రైతులు అధిక శాతంమంది బోర్లపై ఆదారపడి పంటలు పండిస్తున్నారన్నారు .అందువలన తక్కువ నీటిశాతం ఉపయోగపడే ఆరుతడిపంటలు వేసుకొని అధిక దిగుబడులు సాదించు కోవాలన్నారు.పై విషయాలపై రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు వ్యవసాయాదికారులు రైతులకు ఎప్పుడూఅందుబాటులో ఉంటారన్నారు. ఈకార్యక్రమంలో విఏఏ వెంకటేశ్వర్లు,విహెచ్ అనూష ,ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

## పదోతరగతిలో సత్తా చాటిన గ్లోబల్ స్కూల్



**బుచ్చి ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీలోని గ్లోబల్ స్కూల్ విద్యార్దులు ఉత్తమ ఫలితాలు సాధించగా వారిని పాఠశాల కరస్పాండెంట్ షేక్.గౌసియా మగ్దూమ్ అభినందించారు. పాఠశాల స్థాపించి 17 సంవత్సరాలు పూర్తి అయిందని సాధారణ విద్యార్దులతో కూడా అసాధారణ ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం ఎస్ఎస్‌సి పరీక్షలలో 28 మంది విద్యార్దులు తమ స్కూల్ నుండి పరీక్షకు హాజరుకాగా 100 శాతం ఉత్తీర్ణతతో 22 మంది విద్యార్దులు 500 పైగా మార్కులు సాధించినట్లు తెలిపారు. స్కూల్ టాపర్‌గా షేక్ హాజర్ 590 , రెండోవ స్దానం షేక్.అస్మ 588, మూడవ స్దానంలో షేక్ సుహానన 585, తరువాత స్దానంలో పి .వెంకట అశ్రిత 580 మార్కులు ఇలా తమ విద్యార్దులందరు మంచి మార్కులు సాధించడం చాలా సంతోషకరమైన విషయమని తెలిపారు. వారిని అభినందిస్తు వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అదిరోహించాలని కోరారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులను కూడా అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్దుల తల్లిదండ్రులు పాల్గోన్నారు.

## వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



**వింజమూరు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** ప్రస్తుతం వేసవి తాపం ఎక్కువగా ఉండటంతో ప్రజలు తగిన జాగ్రత్తలు వహించి తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని వింజమూరు తహశీల్దార్ ఎస్‌కె హమీద్ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాలలో వేసవి సెలవలు ఉన్నందున విద్యార్థులు, యువత ఉత్సాహంతో చెరువులు, బావులు దగ్గరకు వెళ్లడం జరుగుతుందన్నారు. చెరువులు, కుంటలలో ఇటీవల గ్రావెల్ కోసం త్రవ్విన గుంటలు లోతుగా ఉంటాయని, అవి ఇటీవల కురిసిన వర్షం గుంతలు కనిపించకుండా ఉన్నందున అందులో పడే ప్రమాదం ఉంటుందని ఆయన తెలిపారు. కావున ముఖ్యంగా విద్యార్థులు ఇంటి నుండి బయటకు వెళ్లకుండా ఇంటి వద్ద ఉంటూ తగినటువంటి జాగ్రత్తలు వహిస్తూ ఉండాలన్నారు. ఈతకు వెళ్లడం, సరదా కోసం బైకులు తీసుకుని తిరగడం ఇలాంటి పరిస్థితుల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని కనుక జాగ్రత్తలు వహించి ఇళ్లల్లోనే ఉండాలన్నారు. ప్రస్తుతం పట్టణంలో కంప్యూటర్ కోచింగ్ సెంటర్లు భాషా నైపుణ్య శిక్షణ సంస్థలు ఉపాధి కల్పన శిక్షణ సంస్థలు తదితరాలుగా ఉన్నాయని అందులోకి వెళ్లి వాటిలో శిక్షణ పొందినట్లయితే ఉపాధి పొందగలిగే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకున్న వారవుతారన్నారు. విద్యార్థులు పొలాలకు వెళ్లకుండా ఉండాలన్నారు. పొలాలకు వెళ్లినట్లయితే పొలాల యజమానులు సాగునీటి కోసం బోర్లు వేసి ఉంటారని ఆ బోరుబావులకు మూతలు ఉండవని, అలాంటి పరిస్థితుల్లో బోరు బావుల్లో పడిపోయే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత రెండు మూడు రోజులు రిస్క్యూ ఆపరేషన్‌లని తదితరాలుగా పడాల్సి న బాధలు ఉంటాయన్నారు. పొలాలు యజమానులు కూడా చెడి పోయిన బోరుబావులను శిధిలం చేయడమా లేక మూసి వేయడమా చేయాలన్నారు. కాబట్టి వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వచ్చేటప్పుడు తలకు తువాలుగాని టోపీ గాని పెట్టుకుని రావాలన్నారు. కాబట్టి పరిస్థితులను బట్టి జాగ్రత్తలు వహించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. దాతలు స్పందించి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి వేసవి తాపం ఎక్కువైనందున వింజమూ రుకు వచ్చే వివిధ ప్రాంతాల ప్రజలు దాహార్తినితీర్చేందుకు దాతలు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలనిఆయన కోరారు. రకరకాల పనులపై వచ్చే ప్రజలు ఎండతాపానికి దాహం తీర్చుకునేందుకు డబ్బులు ఖర్చు చేయాల్సి ఉం టుందని, ఇలాంటి ప్రయాసవారికి లేకుండా చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లయితే ప్రజలకు ఉపయో గకరం గా ఉంటుందన్నారు. కనుక దాతలుస్పందించి చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఉగ్రదాడికి నిరసనగా జనసేన మానవహారం



**నెల్లూరు,ఏప్రిల్25 ప్రభాత వార్త -విద్య :** జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదులు చేసిన నరమేధాన్ని నిరశిస్తూ శుక్రవారం నగర జనసేన పార్టీ అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు ఆధ్వర్యంలో నగరంలోని స్దానిక గాంధీబొమ్మ సెంటర్‌లో మావనహారం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా దుగ్గిశెట్టి మాట్లాడుతు తమ పార్టీ అధినేత, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు నేడు మానవమారం నిర్వహించామన్నారు. ప్రశాంతతకు మారుపేరైన భారతదేశంలోకి అక్రమంగా చొపబడి మారణహోమం సృష్టిస్తున్న ఉగ్రచర్యలను అందరూ ముక్తకంఠంతో వ్యతిరేఖించాలన్నారు. ప్రధాని మోదీ ఈ ఘనటపై ఎంతో కోపంగా ఉండటంతో పాటూ పాక్‌కు సింధూజలాల నిలిపేత,పాక్ దేశస్తులను పంపించి వేయటం వంటి వాటిని అమలు చేస్తున్నారని ఇది అభినందనీయమన్నారు. హిందువులను అతి కిరాతకంగా మతం అడిగి మరీ చంపిని ఈ ఘటనతో యావత్‌దేశాలు అన్నీ భాతర్‌కు అండగా నిలిచేందుకు ఏకతాటిపైకి వస్తున్నాయన్నారు. ఈ ఘటనలతో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించటంతోపాటూ వారి వారి కుటుంబాలకు జనసేన అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు విజయలక్ష్మీ, షేక్.ఆలియా, అజయ్ బాబు, సాయి మోహన్, కంతర్, శ్రీకాంత్, ఉదయ్‌కిరణ్, శ్యామ్, పవన్‌రెడ్డి, ఆనందరావు, రాముదు, ఆజీజ్, మల్లిక, హైమవతి, ఆకాశ్, హరీష్, భీమయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎపి పాలిసెట్ హాల్‌టికెట్లు విడుదల



**కావలిరూరల్, ఏప్రిల్25 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక విద్య శిక్షణ బోర్డు (ఎస్‌బి టీఈటీ) ఎపి పాలిసెట్ 2025 హాల్ టికెట్లను విడుదల చేసినట్లు కావలి, రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, కావలి పాలిసెట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.సుశీల్‌కుమార్‌ప్రియ శుక్రవారం తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దీనికి సంబంధించిన పరీక్ష ఏప్రిల్ 30వ తేది బుధవారం నిర్వహించడం జరుగుతుందని తమ హాల్‌టికెట్లను పాలిటెక్నిక్ ఎపిఎన్‌ఐసి.ఇన్ అనే అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలియచేశారు. హాల్‌టికెట్ అనేది కేవలం ఆన్‌లైన్ ద్వారానే అందుబాటులో ఉంటుందని అది ఏ ఇతర ఆఫ్‌లైన్ లేదా ఫోన్‌ద్వారా పంపబడవని తెలియ చేశారు. అభ్యర్థులు చివరినిమిషం వరకు వేచిచూడక ముందుగానే హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ అయ్యి ఫీ పేమెంట్ ఫెయిల్ అయిన అభ్యర్థులు తక్షణమే తమను గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించి పరిష్కారం చేయించుకోగలరని తెలియచేశారు. మరింత సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌ని లేదా కావలి, రుద్రకోట గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల నందు సంప్రది ంచాలని తెలియచేశారు. మరిన్ని వివరములకు 9949022772 సెల్‌నెంబరును సంప్రదించాలని తెలియచేశారు.

## చేజర్లలలో మలేరియా దినోత్సవం



**చేజర్ల ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన చేజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రపంచ మలేరియాదినోత్సవ వేడుకలు ఘనంగానిర్వహి ంచారు. మలేరియా దినోత్సవంపై వైద్యశాల సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా అంతం మనతోనే మనందిరిలో మార్పు వస్తే మలేరియా అంతం అవుతుందని స్లోగన్‌తో నినాదం చేశారు. మలేరియా పైన అవగాహన కల్పించారు.వైద్యాధికారి మొహతాబ్,సిహెచ్ఓ చంద్రయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## మనతోనే మలేరియా అంతం



**సీతారామపురం ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది ర్యాలీని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపిహెచ్ఇఒ మజీద్ మాట్లాడుతు మలేరియా అంతం మనతోనే అనే నినాదంతో అందరిలో మార్పు వస్తే మలేరియా అంతం అవుతుందని తెలిపారు. దోమలు కుట్టకు ండా,దోమలు పుట్టకుండా ఉండడానికి ప్రతి ఒక్కరు ఫ్రైడే డ్రైడేని పాటించాలని నీరు నిలువ లేకుండా చూడాలని అన్నారు.ప్రతి ఒక్కరు దోమ తెర వాడలని కిటికీలకు మెసులు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు.జ్వరం వచ్చిన వెంటనే ఆసుపత్రికి వచ్చి రక్త పరీక్షలు చేయించుకోవాలని అన్నారు.ఈకార్యక్రమంలో ఎంపిహెచ్ఏలు ఆరోగ్యకేంద్రం సిబ్బంది,ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ రమేష్ భౌతికకాయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే దగుమాటి



**కావలి, ఏప్రిల్25 ప్రభాతవార్త :** కావలిరూరల్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తూ అనారోగ్య కారణంగా మృతిచెందిన కానిస్టేబుల్ సూరిశెట్టి నాగరమేష్ భౌతికకాయాన్ని కావలి ఎమ్మెల్యే సందర్శించి నివాళుల ర్పించారు. శుక్రవారం కావలి పట్టణ 9వ వార్డు అరటితోటలో నివసిస్తున్న రమేష్ నివాసానికి టిడిపి నేతలతో వెళ్లారు. కానిస్టేబుల్ మృతదేహంపై పూల మాల ఉంచి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢసానుభూతిని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట పోలీసు అధికారులు, పోలీసులు, టిడిపి నేతలు పాల్గొన్నారు.

## జాతీయ మలేరియా దినోత్సవం

**ఉదయగిరి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త** స్థానిక గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉదయగిరి పురవీధుల్లో శుక్రవారం ఆరోగ్య శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో జాతీయ మలేరియా దినోత్సవంపై ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం నుండి ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ వరకు వైద్యాధికారి డాక్టర్ ఎం.శివకల్పన సమక్షంలో మలేరియాపై ఆరోగ్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. మలేరియా ఆడ అనాపలిస్ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుందని తెలిపారు. మలేరియా నాలుగు రకాలు అన్నారు. వ్యాధి ప్రమాదకరమైందని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి పూట నిద్రించే సమయంలో దోమతెరలు వాడాలని, అదే విధంగా కిటికీలకు మెస్‌లు అమర్చుకోవాలని తెలియజేశారు. ఈ వ్యాధికి గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉదయగిరి ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గండిపాలెం ఆరోగ్య విద్యా బోధకులు కలసపాటి వెంకట సుబ్బయ్య, సీహెచ్ఓ శివకుమారి, మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషద్ బాబు, ఆరోగ్య పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు, చెన్నయ్య, అంకమ్మ తదితులు పాల్గొన్నారు.

## వైభవంగా మహావిష్ణువు రథోత్సవం



**సైదాపురం, ఏప్రిల్ 25, ప్రభాతవార్త** మండలపరిధిలోని కృష్ణారెడ్డిపల్లి గ్రామంలోని వైకుంఠపురంలో వెలసి ఉన్న శ్రీ మహావిష్ణు మహాలక్ష్మీ ఆలయంలో సమర్ధ సద్గురు పాతయ్య స్వామి ఆలయంలో నిర్వహి స్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ మహ విష్ణువు మహాలక్ష్మీదేవిల రథోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాత్రి అస్వవాహన సేవ,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉభయదాతలు శ్రీనాథ్‌రెడ్డి, హరీష్‌రెడ్డి,కృష్ణచైతన్యరెడ్డి, నెల్లూరుకు చెందినపోతేగుంట శ్రీధర్ నాయుడు, ఆయన సతీమణి శ్రీలక్ష్మీలు పాల్గొన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాపూరు సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్సై కాంతికుమార్ పటిష్టంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మైనింగ్ మాఫియాకు కొమ్ముకాస్తున్న తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి



**సైదాపురం, ఏప్రిల్ 25, ప్రభాతవార్త** మండలంలోని మైనింగ్ మాఫియాకు కొమ్ముకాస్తున్న తహశీల్దార్ రమాదేవిపై జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టాలన్నారు. అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య తెలిపారు. మండల పరిధిలోని ఊటుకూరు గ్రామ పరిధిలో మైనింగ్ మాఫియా ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను దళితులకు పంచి వారికి యాజమాన్య హక్కు కల్పించాలంటూ అఖిల భారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సైదాపురంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి నిరవధిక ధర్నా చేపట్టారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బలవంతంగా దళితులను బయటకు పంపివేశారు. ఈ సందర్భంగా డీపీ పోలయ్య మాట్లాడుతూ మైనింగ్ మాఫియా దళితులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తి వేసి భూస్వాముల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని దళితులకు పంపిణీ చేయాలని తెలిపారు. మైనింగ్ మాఫియాకు తొత్తుగా మారి ఎలాంటి అనుమతులు లేకుండా దళితుల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను వెంకటకృష్ణ మైనింగ్ కంపెనీకి అప్పగించి మైనింగ్ మాఫియా ద్వారా దళితులపై అక్రమ కేసులు పెట్టించారని, వెంటనే అక్రమ కేసులను ఎత్తివేయాలని ఆయన అన్నారు. మండలంలో మైనింగ్ మాఫియాకు సహకరిస్తున్న తహశీల్దార్‌పై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్‌చేశారు.మహిళలపై పోలీసులు అసభ్యకరంగా ప్రవర్తించడం సరికాదని తెలిపారు. మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేశ్వర్లు, కే.రమేష్, మహిళ నాయకురాళ్లు పాల్గొన్నారు.

## శ్రీఅభయాంజనేయస్వామి వారి 22వ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం



**వింజమూరు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త** వింజమూరు పాతూరు నందు వేంచేసి యున్న శ్రీ అభయాంజనేయ స్వామి వారి 22వ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం స్వామివారికి ఉదయాన్నే పాలాభిషేకం జలాభిషేకం, పంచామృత అభిషేకం కార్యక్రమాలు జరిపించారు. స్వామివారిని మొదట చిరుమామిళ్ల తిరుపాల్ నాయుడు సుజాత దంపతులు ప్రతిష్ఠ కార్యక్రమాన్ని జరిపించారు. అప్పటి నుండి స్వామివారికి పూజా దూప దీప నైవేద్యాలు సమర్పిస్తూ వస్తున్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా గంగిరెడ్డిపాలెం భజన బృందంచే కోలాట ప్రదర్శన నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి రథంపై అధిష్టింపచేసి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారికి కాయకర్పూరం చెల్లించారు. అలాగే స్వామివారి కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఉదయాన్నే అభిషేకములు ప్రత్యేక పూజలు హోమములు నిర్వహిస్తామని నిర్వహణ కమిటీ తెలియజేశారు. మధ్యాహ్నం గొప్ప అన్నదాన కార్యక్రమం జరుగుతుందని కావున భక్తులందరూ విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరా రు. ఈ కార్యక్రమాలను శ్రీ అభయాంజనేయస్వామి వారి భక్త బృందం పర్యవేక్షిస్తున్నారు.

## ఇష్టానుసారంగా లారీల అన్‌లోడింగ్ - ట్రాఫిక్ జామ్‌లో కోవూరు



**కోవూరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** కోవూరు బజార్ సెంటర్ నుంచి మందబయలు సెంటర్ వరకు ఉన్న పలు వ్యాపారస్తులు తమ వ్యాపారానికి సంబంధించిన వస్తువులను వేళాపాల లేకుండా తమ ఇష్టానుసారంగా ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో అన్‌లోడింగ్ చేసుకోవడం వలన ట్రాఫిక్‌కు పూర్తిగా అంతరాయం ఏర్పడుతుంది. ఫలితంగా ద్విచక్ర వాహన చోదకులు తీవ్రస్థాయిలో ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది. వాస్తవంగా మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల ప్రాంతంలోనే ఈ వ్యాపారస్తులు వస్తువులు అన్‌లోడింగ్ చేసుకోవాలని ఉన్నా వీరు మాత్రం ఉదయం, రాత్రి వేళల్లో తమ ఇష్టానుసారంగా అన్‌లోడింగ్ చేసుకుంటూ ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్ శాఖ స్పందించి ట్రాఫిక్ జామ్‌ను క్రమబద్ధీకరించాలని ద్విచక్రవాహనదారులు కోరుకుంటున్నారు.

## ఎట్టకేలకు రైల్వే టికెట్ విక్రయ కేంద్రం పునః ప్రారంభం

**బిట్రగుంట ఏప్రిల్ 25 ప్రభాతవార్త** బిట్రగుంట రైల్వే స్టేషన్ నందు బుకింగ్ ఆఫీసును పునః ప్రారంభించేందుకు రైల్వే అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షులు షేక్ నూరుద్దీన్ మాట్లాడుతూ తాము చేసిన పోరాటాలు మరియు అధికారులకు రాసిన లేఖల ద్వారా, అలాగే నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక చొరవ వల్ల ఎట్టకేలకు బిట్రగుంటలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్,బుకింగ్ ఆఫీసును రైల్వే అధికారులు శనివారం నుండి అధికారికంగా ప్రారంభించనున్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారికి బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షులు షేక్ నూరుద్దీన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఇదే విధంగా బిట్రగుంట రైల్వే పరిశ్రమల మీద చర్యలు తీసుకోవాల్సిందిగా వేమి రెడ్డి ప్రభాకర్ రెడ్డికి అభ్యర్థించారు.

## శ్రీనేతాజీలో శ్రీసాయి సత్సంగ సమావేశాలు



**నెల్లూరు,ఏప్రిల్25 ప్రభాతవార్త-విద్య** శుక్రవారం నగరంలోని స్థానిక విజయమహల్‌గేట్‌సమీపంలోని శ్రీ నేతాజీ ఎమ్మెసార్ పాఠశాలలో శ్రీ కర్లపూడి కృష్ణ సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ సాయి సత్సంగ సమావేశాలు ఘనంగా ప్రారంభయ్యాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతు శ్రీశైలం సాయి దాసు, సాయి టివి.ప్రవచనకర్త రెడ్డి సుబ్రహ్మణ్యం, ఫౌండేషన్ నిర్వాహకులు కర్లపూడి కృష్ణ, అద్దాల సాయి బాబా మందిరం నిర్వాహకులు మదుసాయి ల ఆధ్వర్యంలో నేటి నుండి ఈ సత్సంగ సమావేశాలు మూడు రోజులపాటూ ఉదయం 9 గంటల నండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిచటం జరుగుతుందన్నారు. సాయి భక్తులు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని వీటిని విజయవంతం చేయ్యాలని వారు కోరారు. తోలుత సాయి భక్తులుపెద్ద సంఖ్యలో పాల్గొని సాయి నామ సంకీర్తనలతో సమావేశాలను ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్, సిబ్బంది, సాయి భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా విజ్ఞప్తులను స్వీకరించిన ఎమ్మెల్యే



**వింజమూరు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త** వింజమూరులో తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తుల దినం సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరిం చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటిని పరిష్కరించాలని ఆదేశాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శుక్రవారం ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖ అధికారులకు పంపించడం జరిగింది. వాటిని పరిష్కరించాలని ఆదే శాలు ఇచ్చారు. ముఖ్యంగా దుత్తలూరు మండలం వింజమూరు, కలిగిరి, వరికుంటపాడు మండలాలకు సంబంధించిన అర్జీలు అధికంగా వచ్చాయి. ఈ కార్యక్రమంలో 8 మండలాల నాయకులు, అర్జీదారులు తదితరులు ఉన్నారు.

## జేసీని కలిసిన నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ. నందన్



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ. నందన్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్‌ని తమ కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

## యథేచ్చగా ఉదయమే మద్యం అమ్మకాలు - చోద్యం చూస్తున్న అధికారులు



**ఉదయగిరి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త** మండల కేంద్రం అయిన ఉదయగిరిలో ఉదయం 6గంటల నుంచి యథేచ్చగా మద్యం విక్రయాలు సాగుతున్నప్పటికి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు పట్టిపట్టనట్లుగా ఉండటంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్‌కు అత్యంత సమీపంలో ఉన్న బ్రాందీ షాపులోనే ఉదయం 6గంటలకు అమ్మకాలు జరుగుతున్నప్పటికి అధికారులు ఎందుకు అరికట్టలేకపోతున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బ్రాందీ షాపుల దగ్గర ముడుపులు తీసుకుంటూ బెల్టు షాపులకు సైతం అధికారులు సహకరిస్తు న్నారంటూ ఆరోపణలు వస్తున్నాయి. ప్రతి గ్రామంలోనూ ప్రధాన మద్యం షాపు నుంచి మద్యాన్ని తరలించి బెల్టు షాపులుగా మార్చి ఆదాయాన్ని గడిస్తున్నారు. పలు బ్రాండ్లపై ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే పది రూపాయలు అదనంగా తీసుకుంటూ మద్యం ప్రియుల జేబులకు చిల్లులు కొడుతున్నారు. రాత్రి 11గంటలైనా ఉదయగిరిలో మద్యానికి కొదవలేనట్లుగా విక్రయమాలు జరుగుతూనే ఉన్నప్పటికి ఉన్నతాధికారుల నిఘా కానీ, స్థానిక అధికారుల నిఘా కానీ లేకపోవడం ముడుపులు ముట్టడమే ప్రధాన కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఉదయగిరి మద్యం షాపులపై నిఘా ఏర్పాటు చేయాలని నిబంధనలు పాటించేలా చూడాలని కోరుతున్నారు. ఉదయం 6గంటలకే మద్యం విక్రయాలు జరుగుతున్న సందర్భంలో సుదూర ప్రాంతాల నుంచి ఉదయగిరి బస్టాండ్‌లో దిగిన మహిళ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని నివాస గృహాల నడుమ బస్టాండ్ సమీపంలో ఉన్న బ్రాందీ షాపు వల్లనే తమకు బస్సు కోసం వేచి ఉండే పరిస్థితి కూడా లేకుండా పోతుందని ప్రయాణికులు సైతం వాపోతున్నారు.

## చదువుల తల్లిని అభినందించిన జిల్లా కలెక్టర్



**కలువాయి ఏప్రిల్ 25 ప్రభాతవార్త** ఆ బిడ్డ ఆర్థికంగా పేద అయినప్పటికి చదువులలో మాత్రమే సరస్వతీ పుత్రికేనని చెప్పవచ్చు. ఇటీవల విడుదలైన పదోవతరగతి పలితాలలో 6 వందల మార్కులకు 568 మార్కులు సాధించినందుకు రెడ్డి పోగు హర్షిత ప్రియను జిల్లా కలెక్టర్ అభినందించారు. హర్షిత నిరుపేద కుటుంబం అయినప్పటికి చదువుమీద ఇంట్రస్టుతో బాగా చదివి 568 మార్కులు తెచ్చుకుంది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హర్షితప్రియను శాలువతో సన్మానించి ఆ బిడ్డకు సహాయం చేస్తానని హామి ఇచ్చారు.

## కావలి సీనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు చేపట్టిన ఎ.గీతావాణి



**కావలి, ఏప్రిల్25 ప్రభాతవార్త** కావలి సీని యర్ సివిల్ జడ్జిగా ఎ.గీతావాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంత పురం జిల్లా ధర్మవరం సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తూ కావలికి బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా కావలి బార్ అసోసియేషన్‌అధ్యక్షుడు కాటా సురేంద్రరెడ్డి ఆధ్వర్యం లో న్యాయమూర్తి గీతావా ణిని దుశ్శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛంఅందచేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ కార్యదర్శి మిట్టసల్ల జయప్రకాష్, సీనియర్ న్యాయవాది కలికి శ్రీనివాసులురెడ్డి, ట్రెజరర్ అభిషేక్, న్యాయవాదులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీని కలిసిన నూతన కమిషనర్



**నెల్లూరు క్రైమ్ ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వై.ఓ. నందన్ జిల్లా యస్.పి. జి. కృష్ణకాంత్‌తో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీకి కమిషనర్ పుష్పగుచ్ఛాన్ని అందజేయగా ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు.

## విడిచి ఉండలేక మరణంతో ఒకటయ్యారు

### - నెల్లూరులో ప్రేమ జంట ఆత్మహత్య





**నెల్లూరు క్రైమ్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త** ఒకరిని ఒకరు విడిచి ఉండలేక... కలిసి జీవిం చేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించక... వారిని ఒప్పించలేక... చివరకు మరణమే తమను ఒకటిగా ఉంచగలరని భావించి చావును ఆశ్రయించింది ఓ ప్రేమజంట. పూర్తి వివరాల్లోకి వెళితే...పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు ప్రాంతానికి చెందిన జోసెఫ్ (25), కృష్ణాజిల్లా కైకలూరు ప్రాంతానికి చెందిన శ్రావణి (23)లు మూడు రోజుల కిందట నెల్లూరుకు వచ్చారు. రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ హోటల్లో జాబ్ కౌన్సిలింగ్‌కి వచ్చామని చెప్పి గది అద్దెకు తీసుకున్నారు. రెండు రోజుల నుండి గది దాటి బయటికి రాలేదు. అదే సమయంలో వారి గది నుండి దుర్వాసన వస్తుండడంతో లాడ్జి సిబ్బంది సంతపేట పోలీసులకు సమాచారం అందించారు. సంతపేట సీఐ దశరథ రామారావు గది వద్దకు చేరుకుని తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లగా విగత జీవులుగా పడి ఉన్న జంటను మంచంపై చూశారు. మృతదేహాలు కుళ్లిన స్థితిలో ఉన్నాయి. మృతదేహాల వద్ద సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ లేఖలో తామిద్దరం ప్రేమికులమని, తమ ప్రేమను పెద్దల అంగీకరించలేదని, తమ వివాహానికి ఒప్పుకోకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు లేఖలో వెల్లడించారు. అనంతరం పోలీసులు మృతదే హాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి సమాచారాన్ని మృతుల కుటుంబీకులకు తెలియజేసామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సంతపేట సిఐ దశరథ రామారావు తెలిపారు.







## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం



**నెల్లూరు,ఏప్రిల్25 ప్రభాతవార్త-విద్య** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమౌతుందని ప్రముఖ వైద్యులు డాక్టర్ పోకల రవి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని స్థానిక అన్నమయ్య సర్కిల్‌లోని ఎన్‌టిఆర్ పార్కులో ఉచిత యోగా,ఫిట్‌నెస్ సమ్మర్‌కోచింగ్ క్యాంప్ ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి క్యాంప్‌ను ప్రారంబించారు. ఈ సందర్భంగా వైద్యులు పోకల రవి మాట్లాడుతు ఆరోగ్యం ధనంతో కొనలేని అతివిలువైనందన్నారు. దీనిని చెటు అలవాట్లతో పాడు చేసుకోకుండా, మంచి అలవాట్లతో కలకాలం కాపాడుకోవాలన్నారు. చిన్న తనం నుండే అందరూ యోగా, క్రీడలు, వ్యాయామం వంటిని అలవాటు చేసుకోవాలని సూచించారు. నేటి యాంత్రిక జీవితంలో చిన్నారులు చిన్నతనంలోనే ఊబకాం, బిపీ,చక్కెర వ్యాధి వంటి వ్యాధులకు గురి అవుతున్నారన్నారు. అటువంటిని నివారించేందుకు శారీరక శ్రమ, క్రమం తప్పని వ్యాయామం అవసరమన్నారు. కోచ్ వెంటక్ మాట్లాడుతు చిన్నారులు, వృద్ధులు అందరూ ఈ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాయామం వలన అనేక శారీరక రుగ్మతులు దూరం అవుతాయన్నారు. పార్కు డెవలెప్మెంట్ కమిటీ సభ్యులు నాగేంద్ర, లాయర్ వెంకటేశ్వర్లు, కమతం సుబ్బారావు, ఈఈ శ్రీధర్, రవిచంద్ర, మునిశేఖర్, పెంచలయ్యపాల్గొన్నారు.

## ఉగ్రవాదుల దాడులను ఖండిస్తు కొవ్వొత్తుల ర్యాలీ



**బుచ్చి ఏప్రిల్ 25 ప్రభాతవార్త** ఉగ్రవాదాల అమానుష దాడులను ఖండిస్తు బుచ్చిరెడ్డిపాళెం వాసవి క్లబ్ వారు పార్కు వద్ద నుండి బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా అధ్యక్షులు మాలేపాటి రవికుమార్ మాట్లాడుతు దొంగచాటుగా వచ్చి అమాయకులైన యాత్రికులను చంపడం వారి రక్షసత్వానికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం ఉగ్రవాదులను హతమార్చాలని వారు డిమాండ్ చేశారు. వాసవిక్లబ్ ప్రెసిడెంట్ మాలేపాటి రవికుమార్, సెక్రటరీ కనిగెల్పుల విశ్వనాద్, ట్రెజరర్ పరిమి కిషోర్‌బాబు, వాసవి క్లబ్ సీనియర్‌నాయకులు తీరివీధి రాధాకృష్ణయ్య,సొల్లేటి ప్రబాకర్, కారం శెట్టి ప్రసాద్,గాదంశెట్టి శ్రీనివాసులు, బచ్చు సుబ్బారావు,వాసవీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతుల ప్రకారమే భవన నిర్మాణాలు జరిగేలా పర్యవేక్షించండి : కమిషనర్ వై.ఓ. నందన్



**నెల్లూరు కార్పొరేషన్,ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ వారాంతపు సమీక్షలో భాగంగా టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సమావేశాన్ని శుక్ర వారం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అనుమతులకు విరుద్ధంగా నగరంలో నిర్మిం చిన అన్ని భవనములకు చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. చార్జిషీట్ల దాఖలా అనంతరం తీసు కోవాల్సిన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. ప్రధాన డ్రైన్ కాలువలపై ఎలాంటి ర్యాంపులు, మెట్లు తదితర నిర్మాణాలు జరగకుండా పర్యవేక్షించాలని, డ్రైను కాలువల పూడికతీత పనులకు అటువంటి నిర్మాణాలు అడ్డంకిగా మారకుండా పర్యవేక్షించాలని సూచించారు. నగరవ్యాప్తంగా పోస్టర్లు, ఫ్లెక్సీలు లేకుం డా పర్యవేక్షించాలని, అనుమతులు లేని ప్రచార సామాగ్రిని వెంటనే తొలగించాలని కమిషనర్ ఆదేశిం చా రు.నగరంలో నెల్లూరు నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం వారి అనుమతుల ప్రకారమే భవన ముల నిర్మాణం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని, నిర్మాణాలను పిల్లర్ల స్టేజిలోని గుర్తించి అనుమతుల ప్రకారం నిర్మించనిచో వెంటనే నిర్మాణ పనులను నిలుపుదల చేయవలసినదిగా ఆదేశించారు. ట్రాఫిక్ కు అడ్డంకిగా రోడ్లపై, వీధులలో ఉన్న నిరుపయోగమైన వాహనాలను పోలీసు వారి సహాయముతో వెంటనే తొలగించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యము లేకుండా తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమా వేశంలో సిటీ ప్లానర్ పద్మజ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వేణు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పార్కులలో వసతులు కల్పించి ప్రజలకు అందుబాటులోకి తేవాలి : కమిషనర్ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** పట్టణ పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ ఆలోచనల మేరకు నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని పార్కులలో జిమ్ పరికరాలు, పచ్చదనం, పెయింటింగ్ తది తర మౌళిక వసతులను కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ శుక్రవారం 4, 5, 9వ డివిజన్లు జాకీర్ హుస్సేన్ నగర్, రేబాల వారి వీధి పరిసర ప్రాంతాలలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డివిజన్ల పరిధిలో పార్కులను అభివృద్ధి చేసి పార్కులలో అవసరమైన ఆట వస్తువులు, క్రీడా పరికరాలు, వ్యాయామ సౌకర్యాలను, పాదచారుల ట్రాక్, పచ్చదనం, పెయింటింగ్, బెంచీలు తదితర మౌళిక సదుపాయాలను కల్పించి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పార్కులను అభివృద్ధి చేసి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తేనున్నామని వెల్లడించా రు.అన్ని డివిజనుల్లో ప్రధాన డ్రైను కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత క్రమం తప్పకుండా జరపాలని సూచించారు. అవసరమైన అన్ని ప్రాంతాల్లో డ్రైను కాలువల నిర్మాణాలకు ప్రణాళి కలను సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు.నగరవ్యాప్తంగా ప్రణాళికాబద్ధమైన పారిశుధ్య నిర్వహణకు, దోమల నిర్మూలనకు ప్రతిష్టాత్మక చేపట్టిన భూగర్భ డ్రైను వ్యవస్థలో అన్ని గృహాలను అనుసంధానం చేసి, పరిశుభ్రమైన నగరంలా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నామని, ప్రతి ఒక్కరు తమ స్థలాల చుట్టూ ప్రహరీ నిర్మాణం, గేటు ఏర్పాటు, తగిన రక్షణ చర్యలను తీసుకుంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు దోహదపడాలని కమిషనర్ సూచిం చారు.నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఈ.ఈ. రహంతు జానీ,డి.ఈ.ఈ. రఘురాం అధికారులు, ప్రజా ప్రతినిధులు,సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.